కొరియన్ జానపద కథ ఆధారంగా...

"లాభం లేదు, తేజా! నువ్వు మరో ఆరు వారాలు అక్కడ గడిపి మరింత శ్రద్ధగా, శబ్దాలను గమనించి రావడం అత్యవసరం."

# నిశ్శబ్ద సంగీతం

## దాసరి అమరేంద్ర

తేజకు మతి పోయింది. కాస్తంత చిరాకు కలిగినా తమాయించుకున్నాడు. ఎంత ఆలోచించినా లోప మెక్క డుందో అర్థం కాలేదు. తను కెమికల్ టెక్నాలజీలో స్వర్ణ పతకం పొందిన వాడు ... ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హార్వర్డ్‌లో ఎం.బి.ఏ. చేశాడు. ఆ తర్వాత అమెరికాలోనే ఓ పెద్ద ఫార్మాస్యూటికల్ కంపెనీలో రెండేళ్లు పని చేసి విద్యావిజ్ఞానాలకు తోడుగా అనుభవం కూడా సంపాదించిన వాడు ... తాతగారు స్థాపించిన బ్రహ్మాండమైన పారిశ్రామిక సామ్రాజ్యాన్ని స్వాధీనం చేసుకుని, తనదైన బాణీలో వ్యాపారాన్ని అభివృద్ధి చేసి, దేశానికే పరిమితమైన తమ రంగాన్ని ప్రపంచ వ్యాప్తం చేసి ఏ రిలయెన్స్ అంబానీ గారి లాగానో ప్రఖ్యాతీ, ప్రాచుర్యం పొందాలని తహతహ లాడుతున్నాడు.

ఈ డాక్టర్ జోషి పానకంలో పుడకౌతున్నారా? అయినా తాతగారికి ఈ గురువుగారి మీద అంత గురెందుకో?

* * *

స్వాతంత్ర్య సంగ్రామంలో చిత్తశుద్ధితో పాల్గొని, అనేక కష్టనష్టాలకు ఓర్చి, కృష్ణా జిల్లా యువ గాంధీగా పేరు తెచ్చుకున్న వారు అడుసుమిల్లి విశ్వేశ్వరరావు గారు. స్వాతంత్ర్యా నంతరపు రాజకీయాల కంపు భరించ లేక తన శక్తిసామర్థ్యాలను పారిశ్రామిక రంగానికి మళ్లించి శ్రమనే పెట్టుబడిగా పెట్టి చిన్న ఎత్తున సబ్బులూ, వాసన నూనెలూ తయారుచేసే స్వరాజ్య కెమికల్స్‌ను పంతొమ్మిది వందల యాభై రెండులో స్థాపించారు. అది మూడు పువ్వులూ ఆరు కాయలుగా వర్ధిల్లి 'ఇంతింతై, వటుడింతై' అన్న చందాన దినదిన ప్రవర్ధమానం చెంది అటామిక్ ప్లాంట్లకూ, శ్రీహరి కోట రాకెట్లకు ప్రత్యేకమైన ఇంధనాలను సరఫరా చేసే స్థాయికి ఎదగడం భారత దేశపు పారిశ్రామిక చరిత్రలో ఓ ఉత్తేజకరమైన ఘట్టం. నియమాలకూ, విలువలకూ కట్టుబడి ఉన్న ఉత్తమ పారిశ్రామిక వేత్తగా విశ్వేశ్వరరావు గారికి దేశ మంతటా పేరు ప్రఖ్యాతు లున్నాయి. కెమికల్స్ దగ్గర మొదలైన ఆయన పారిశ్రామిక సామ్రాజ్యం, పత్రికలు, పంచదార, సిమెంటు, కరెంటు, మోటారు కార్లు, పళ్లరసాలు - ఇలా అనేకానేక రంగాలకు విస్తరించిందీ నలభై సంవత్సరాలలో, అన్ని రంగాలలోనూ ఆయనదే పెద్ద పీట.

విశ్వేశ్వరరావు గారికి వయస్సు మళ్లింది. సరైన వారసులు లేక పోవడంతో ఎనభయ్యో పడిలో పడినా ఇంకా అన్ని వ్యవహారాలనూ సొంతంగా చూసుకోవలసి వస్తోంది. అది మానసికంగా, శారీరకంగా విపరీతమైన శ్రమ కలిగిస్తోంది. వీలైన పక్షంలో తన కూతురు కొడుకు - తేజకు పను లప్పజెప్పి, కృష్ణా - రామా అంటూ విశ్రాంతి తీసుకోవాలని ఆయన ఆలోచన.


తేజ తెలివైన వాడు. చురుకైన వాడు. అపారమైన ఆత్మవిశ్వాసం అతని పట్టుకొమ్మ. సాంకేతిక విద్యలోనూ, మానేజిమెంటు చదువులలోనూ విశేషమైన ప్రతిభ చూపించి అందరి మన్ననలూ పొందిన వాడు.

అయినా విశ్వేశ్వరరావు గారి కో అనుమానం - తేజలో ఉత్సాహంతో సరి తూగగల సంయమనం లేదనీ, మానవ స్వభావాలను, మనస్తత్వాలను తరచి చూడగల సామర్థ్యం అలవడ లేదనీ, సహోద్యోగులూ, సామాన్య ప్రజల మనోభావాలను అర్థం చేసుకోకుండా ప్రవర్తించే వాడు పారిశ్రామిక సామ్రాజ్యానికి నేతగా సరితూగ లేడని ఆయన భావన. బాగా ఆలోచించి తేజను భాగ్య నగరపు శివార్లలో బంజారా హిల్స్ కొట్టకొసన ఓ అత్యాధునిక మానేజిమెంటు స్కూలును స్థాపించి నిర్వహిస్తున్న డాక్టర్ జోషి వద్దకు పంపారు విశ్వేశ్వరరావు గారు.

డాక్టర్ జోషికి అరవై అయిదేళ్లుంటాయి. ఏభైలా కనిపిస్తారు. రాజస్థాన్‌లో పుట్టి, ఢిల్లీలో పెరిగి, అమెరికాలో చదివి, అన్ని ఖండాలలోనూ పని చేసి, ఐక్యరాజ్య సమితి సలహాదారుగా పదవీ విరమణ చేసి చిట్టచివరికి హైదరాబాదు హద్దుల్లోని ఓ కుగ్రామం తన స్థావరంగా చేసుకుని స్థిరపడ్డారు. మంత్రులూ, ముఖ్యమంత్రులూ, ఉన్నతాధికారులు, పారిశ్రామిక వేత్తలు అతని మిత్ర బృందపు సభ్యులు. బయట చూస్తే మాత్రం సామాన్యుల్లో సామాన్యునిలా కనబడే అసమాన వ్యక్తి ఆయన. ఆయన స్థాపించిన స్కూలు శంకుస్థాపనకు రాష్ట్రపతీ, ఆవిష్కరణకు ప్రధానీ రావడంతో ఆ కుగ్రామం కాస్తా హఠాత్తుగా అత్యాధునికమై పోయింది. ఊరూ, పేరూ లేని ఆ గ్రామం ఇప్పుడు విశ్వవిఖ్యాతం.

* * *

తేజ తన దగ్గరకు వచ్చీ రాగానే అతడిని నీలగిరి కొండల్లో, మూడు రాష్ట్రాల కూడలిలో గజరాజులకూ, చిరుత పులులకూ ఆలవాలమైన





బందీపూర్ అడవుల్లోకి సాగనంపారు జోషీ గారు. ఓ ఏడాది పాటు ఆ అడవుల్లో తిరిగి, అక్కడ వినపడే శబ్దాలను గమనించి, తిరిగి వచ్చి వాటి గురించి సవివరంగా తమకు వివరించ మన్నారు. పరిశ్రమలను పాలించడానికీ, అడవి శబ్దాలను గమనించడానికీ మధ్య ఉన్న సంబంధం ఏమిటో ఏ మాత్రం అర్థం కాక పోయినా, క్రమశిక్షణ గల సైనికుడిలా జోషీ గారి ఆనతిని శిరసావహించి ఏడాది పాటు అడవుల్లో ఒంటరిగా గడిపి వచ్చాడు తేజ.

అలా తిరిగి వచ్చిన తేజను ఆప్యాయంగా ఆహ్వానించి చెప్పినది విన్నారు.

"డాక్టరు గారూ! నేను అడవిలో కోయిలల గీతాలు విన్నాను. ఆకుల సవ్వడి విన్నాను. నదీ జలాల జలతరంగిణీనాదం విన్నాను. తేనెటీగల ఝుంకారాలను విన్నాను. ఏనుగుల ఘీంకారాలు సరే సరి. గాలుల ఈలలూ, నక్క ఊళలూ, కీచురాళ్ల రొదా విన్నాను. క్రిమికీటకాదుల సవ్వడులు సైతం ఆకళించుకున్నాను." అలా అనేక వందల, వేల శబ్దాలను పూస గుచ్చినట్టు వివరించాడు.

జోషీ గారు సంతృప్తి చెంద లేదు.

"లాభం లేదు, తేజా! నువ్వన మరో ఆరు వారాలు ..." కథ మొదటికి వచ్చింది.

తప్పే దేముందీ? పారిశ్రామిక నాయకత్వం కోసం తహతహలాడుతున్న తేజ కిది పొంగే పాలపై చన్నీళ్ల గుమ్మరింతలా తోచినా, తాత గారి మీద, జోషీ గారి మీద ఉన్న గౌరవం వల్ల కిమ్మనకుండా మళ్లీ బందీపూర్ మళ్లాడు. అర్థం పర్థం లేనిదిలా అనిపిస్తున్న ఈ అరణ్య ప్రయోగం వెనుక ఏదో పరమార్థం ఉండి తీరాలని స్ఫురించినా, ఆ పరమార్థ మేమిటో అంతుబట్టక సతమత మయ్యాడు. అయినా ఈ పరీక్షలో నెగ్గాలన్న పట్టుదల పెరిగింది. కుశంకలనూ, చిరాకునూ తొక్కిపెట్టి, రేయింబవళ్లు నిద్రాహారాలు మాని, మరిన్ని శబ్దాల కోసం ఒళ్లంతా చెవులు చేసుకుని విన్నాడు. అయినా అంతకు ముందు విన్న శబ్దాలు వినా మరింకే కొత్త ధ్వనులూ వినబడ లేదు.

విసిగివేసారి నిస్పృహ చెందనున్న సమయంలో హఠాత్తుగా ఓ శుభోదయాన, అతనికి అప్పటి దాకా వినపడని అపూర్వ నూతన శబ్ద సముదాయం వినబడ నారంభించింది. ఆసక్తితో మనసు పెట్టి, చెవులు రిక్కించి మరింత శ్రద్ధగా విన్నాడు. అలా విన్న కొద్దీ ఆ శబ్దాలు మరింత స్పష్టంగా, ప్రస్ఫుటంగా వినబడ సాగాయి. తేజ మనస్సు అనిర్వచనీయమైన ఆనందంలో పొంగిపొరలింది. జోషీగారు ఉద్దేశించని శబ్దా లివే ... ఇవే! అని హృదయం గంతులు వేసింది. వెలిగి పోతున్న మొహంతో జోషీ గారి దగ్గరకు చేరాడు.

"డాక్టరు గారూ! జాగ్రత్తగా, ఏకాగ్రతతో వినగా వినిపించని రాగాలు వినిపించాయి. వినలేని శబ్దాలు విన్నాను. పువ్వులు రెక్కలు విచ్చుకొన్నప్పటి సవ్వడి విన్నాను. రవి కిరణాలు సోకి భూమి వెచ్చనయ్యే శబ్దం విన్నాను. ఉషోదయపు వేళల్లో గడ్డి పోచలు ఆబగా మంచు బిందువులను జుర్రుకోవడం కన్నాను. తేనెటీగలు పూలలోని మధువును గ్రోలే ధ్వని విన్నాను. మబ్బులను చూసిన నెమలి గుండెలు చేసే ఆనంద ప్రకంపనాలను విన్నాను. సంధ్యా సమయంలో ముక్కున మేత కరచుకొని గూటికి తిరిగి వస్తున్న పక్షిని చూసి పక్షి కూన మనసుల్లో చెలరేగే సంతోషపవనాల సవ్వడి విన్నాను. సింహ గర్జనకు బెదిరిన లేడి కూనల గుండెల చప్పుళ్లు విన్నాను ..."

జోషీ గారు సంతృప్తిగా తల పంకించారు. వివరించారు - "చెవులకు వినపడని శబ్దాలను విన గలగడమే సమర్థుడైన నాయకునికి ఉండ వలసిన మొట్టమొదటి లక్షణం" చెప్ప నారంభించారు. "యజమానులే కార్మికుల హృదయ స్పందనలను వినగలిగిన నాడే, వారికి ఉద్యోగులు మనసు విప్పి చెప్పలేని అనుభూతులూ, ప్రకటించుకోలేని ఫిర్యాదులూ, వెల్లడి చేయలేని వేడికోళ్లూ, కళ్లకు కనిపించని కష్టాలూ అవగత మవుతాయి. ఆ రకమైన శక్తి అలవడిన నాడే వారికి సామాన్య కార్మికుల నాడి అందుతుంది. వారి మనసుల్లో ధైర్యాన్నీ, సంతృప్తినీ నింపి, వారి విశ్వాసం పొంద గలుగుతారు. పొరపాట్లు జరిగినప్పుడు గ్రహించ గలుగుతారు. వారి నిజమైన సుఖాలనూ, కష్టాలనూ ఎవరూ చెప్పనవసరం లేకుండా వారే గ్రహించ గలుగుతారు. వినిపించని శబ్దాలను, కనిపించని దృశ్యాలను గమనించ లేని నేత వినిపించే మెచ్చుకోలు మాటలకు లొంగిపోయి, సామాన్యుల హృదయాలకు దూరమై, వారి కష్టనిష్ఠురాలను తెలుసుకో లేక, స్థాపించిన సంస్థ విచ్ఛిత్తికి కారకు డౌతాడు."

పెరిగిన తెలివితో తిరిగి వచ్చిన తేజను చూసి సంతోషించిన విశ్వేశ్వరరావు గారు, తేజ తన వారసుడని ఓ ప్రెస్ రిలీజ్ ఇచ్చారు.